క్లుప్తంగా

రేపు రక్తదాన శిబిరం

ఆత్మకూరు: అభిరామ్ హెల్త్ అండ్ ఎడ్యుకేషనల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మెగా స్వచ్ఛంద రక్తదాన శిబిరాన్ని బుధవారం నిర్వహించనున్నట్లు అభిరామ్ ఆస్పత్రి ఎండీ డాక్టర్ కే శ్రావణ్‌కుమార్ సోమవారం తెలిపారు. పట్టణంలోని అభిరామ్ ఆస్పత్రి ఆవరణలో నోవా బ్లడ్ బ్యాంక్ సౌజన్యంతో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటలకు వరకు జరిగే శిబిరంలో రక్తదాతలు స్వచ్ఛందంగా పాల్గొనాలని కోరారు.

ప్లేట్లు, గ్లాసుల వితరణ

ఆత్మకూరు: పట్టణంలోని ఎల్‌ఆర్‌పల్లి అంగన్‌వాడీ కేంద్రంలోని చిన్నారులకు షేక్ ఖలీద్, గుప్తాఅక్తర్ సోమవారం ప్లేట్లు, గ్లాసులు వితరణ చేశారు. అంగన్‌వాడీ కేంద్రంలో చదువుతున్న తమ కుమార్తె అర్షా పుట్టినరోజును పురస్కరించుకుని ప్లేట్లు, గ్లాసులు పంపిణీ చేశారు. అంగన్‌వాడీ కార్యకర్త షేక్ షకీలా, సహాయకురాలు విజయమ్మ పాల్గొన్నారు.

పాఠశాలలకు పాఠ్యపుస్తకాల పంపిణీ



ఉదయగిరి: మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లోని 1 నుంచి 10వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థులకు ప్రభుత్వం మంజూరు చేసిన సెమిస్టర్-2 పాఠ్యపుస్తకాలను హెచ్‌ఎంలకు ఎంఈఓ-2 శ్రీనివాసులు సోమవారం అందజేశారు. మండలానికి 8,484 పాఠ్యపుస్తకాలు వచ్చాయని ఎంఈఓ తెలిపారు. పుస్తకాలను వెంటనే విద్యార్థులకు అందజేయాలని హెచ్‌ఎంలకు సూచించారు.

రోడ్డు ప్రమాదంలో వీఆర్వోకు గాయాలు

వింజమూరు(ఉదయగిరి): వింజమూరు మండలం చాకలికొండ సచివాలయ వీఆర్వోగా పని చేస్తున్న కంచర్ల రమణయ్య సోమవారం రోడ్డు ప్రమాదంలో గాయపడ్డారు. తన స్వగ్రామం కిస్తీపురం నుంచి తహసీల్దార్ కార్యాలయానికి బైక్‌పై వస్తూ మార్గం మధ్యలో కుక్క అడ్డురావడంతో అదుపుతప్పి పడిపోయి గాయపడ్డారు. స్థానికులు వింజమూరులోని ఓ ప్రైవేట్ వైద్యశాలకు తరలించి ప్రథమ చికిత్స అందించారు.

సోమశిలకు వరద తగ్గుముఖం

సోమశిల : సోమశిల జలాశయానికి వరద ప్రవాహం తగ్గుముఖం పడుతోంది. గత బుధవారం 24,300 క్యూసెక్కులుగా నమోదైన వరద ఆ మరుసటి రోజు నుంచి క్రమంగా తగ్గుతూ వస్తోంది. గురువారం 19,032, శుక్రవారం 17,200, శనివారం 13,500, ఆదివారం 10,200 క్యూసెక్కుల వంతున వరద ప్రవాహం నమోదైంది. సోమవారం సాయంత్రానికి 6900 క్యూసెక్కులకు వరద ప్రవాహం తగ్గుముఖం పట్టింది. ప్రస్తుతం జలాశయంలో 53.961 టీఎంసీల నీరు నిల్వ ఉంది. జలాశయం నుంచి దక్షిణకాలువకు 10వేలు, పెన్నా డెల్టాకు 1000, ఉత్తరకాలువకు 540 క్యూసెక్కుల వంతున విడుదల చేస్తున్నారు.

పంచాయతీ నిధులపై ఆడిట్

వింజమూరు(ఉదయగిరి): వింజమూరు పంచాయతీ కార్యాలయంలో సాధారణ ఆడిట్‌ను సోమవారం చేపట్టారు. ఆడిటర్ జీ శిరీష 2023-24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన జనరల్ ఫండ్, 15వ ఆర్థిక సంఘం నిధుల వినియోగం, జమ, ఖర్చులు, తదితరాలకు సంబంధించిన రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించారు.

భజన గురువుల ఆత్మీయ సమావేశం

సంగం: స్థానిక తిరుమనకొండపై ఉన్న రాజరాజేశ్వరిదేవి జ్ఞానపీఠంలో మండల భజన గురువుల ఆత్మీయ సమావేశాన్ని సోమవారం నిర్వహించారు.అఖిల భారత హిందూ మహాసభ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పోలవరపు కార్తికేయ ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశంలో జ్ఞానపీఠం పీఠాధిపతి రాజరాజేశ్వరానందస్వామి పాల్గొన్నారు. భజన గురువులను సన్మానించి అనుగ్రహ భాషణం చేశారు.

వెంకటసుబ్బయ్య దాతృత్వం అభినందనీయం



సంగం: స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో లైబ్రరీ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న వెంకటసుబ్బయ్య సోమవారం ఉద్యోగ విరమణ పొందారు. ఈ సందర్భంగా వెంకటసుబ్బయ్యను హెచ్‌ఎం బుజ్జయ్య ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు ఘనంగా సన్మానించారు. అనంతరం 500 మంది విద్యార్థులకు వెంకటసుబ్బయ్య వాటర్ బాటిళ్లను వితరణ చేశారు. ఈ కార్యక్రమానికి ఎంఈఓ మల్లయ్య ముఖ్య అతిథిగా హాజరై వెంకటసుబ్బయ్య దాతృత్వాన్ని కొనియాడారు. హెచ్‌ఎంలు మల్లికార్జునరెడ్డి, లక్ష్మీకాంతం, మాల్యాద్రి, విద్యాకమిటీ చైర్మన్ మోహన్ తదితరులు పాల్గొన్నారు.

104 సేవలు

వరికుంటపాడు: మండలంలోని నారసింహపురంలో 104 వాహన సేవలను సోమవారం అందజేశారు. వైద్యాధికారిణి కరీష్మా 35 మందిని పరీక్షించి ఉచితంగా మందులు అందజేశారు. సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు.

పశు బీమాకు ఆదరణ కరువు

- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా అమలు
- మూడేళ్ల కాలానికి 80శాతం ప్రీమియం చెల్లింపు
- రైతుల వాటా 20శాతం
- చెల్లింపునకు ముందుకురాక నష్టపోతున్న రైతులు



మేతకు పోతున్న జీవాలు

ఉదయగిరి: జిల్లాలోని గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయానికి అనుబంధ రంగంగా పాడి పరిశ్రమ ఉంది. దీనిపై ఆధారపడి జీవనం సాగించే వారి సంఖ్య గ్రామాల్లో ఎక్కువగా ఉంటుంది. ప్రమాదవశాత్తు, ప్రకృతి వైపరీత్యాలు, జబ్బు చేసి గాని పాడి పశువు మృత్యువు పాలైతే పాడిరైతుకు తీవ్ర నష్టం వాటిల్లుతుంది. ఈ నేపథ్యంలో వారిని ఆదుకునేందుకు ప్రభుత్వం పశు బీమా పథకాన్ని అమల్లోకి తెచ్చింది. అయితే ప్రస్తుత ప్రభుత్వం పశు బీమాపై నిర్లక్ష్యం వహించి రైతులకు అవగాహన కల్పించకపోవడంతో లక్ష్యం నెరవేరడం లేదు.

రైతుల వాటా 20 శాతం

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా పశు బీమా పథకాన్ని అమలు చేస్తున్నాయి. పాడి పశువులకు బీమా ప్రీమియం మూడేళ్లకు రూ.2వేలు కాగా, కేంద్ర ప్రభుత్వం రూ.800, రాష్ట్ర ప్రభుత్వం రూ.800 భరిస్తాయి. లబ్ధిదారులు తమ వాటాగా రూ.400 చెల్లించాలి. అదే గొర్రెలు, మేకలకు లబ్ధిదారులు రూ.20 చెల్లిస్తే మిగిలిన మొత్తం రూ.80ను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమానంగా చెల్లిస్తాయి. ఒకటి లేదా రెండు పశువులు ఉన్న రైతులు బీమా చెల్లిస్తున్నారు. ఎక్కువ పశువులు ఉన్న వారు బీమా చెల్లించడం లేదు. అదే విధంగా గొర్రెలు, మేకలు కూడా పెద్ద మొత్తంలో ఉన్నవారు బీమా కట్టడం లేదు. దీంతో పశువుల బీమాకు ఆదరణ కరువైంది.

పరిహారం చెల్లింపులు ఇలా..

బీమా చేసిన పశువులు, జీవాలు ఏదైనా ప్రమాదంతో మరణిస్తే పరిహారం అందుతుంది. దేశవాళీ, సంకర జాతి పశువులకు రూ.30 వేలు, నాటు జాతికి రూ.15 వేల వరకు పరిహారం వస్తుంది. అదే విధంగా గొర్రెలు, మేకలకు రూ.6వేలు పరిహారం అందుతుంది. అయితే చాలామంది రైతులు బీమా చెల్లించడం లేదు. దీంతో ప్రమాదవశాత్తు పశువులు, జీవాలు చనిపోతే పైసా కూడా రావడం లేదు. ఆ సమయంలో అధికారులు చుట్టూ తిరిగినా, రాజకీయ పార్టీ నేతలను ఆశ్రయించిన ఫలితం ఉండదు. కావున పశుపోషకులు తప్పనిసరిగా బీమా చేయించుకోవాల్సిన అవసరం ఉంది. ఉదయగిరి, కావలి, ఆత్మకూరు నియోజకవర్గాల్లోని ఎక్కువ మంది రైతులు పశుపోషణ, జీవాల పెంపకం ద్వారా జీవనం సాగిస్తుంటారు. పిడుగుపాటు, విషసర్పాల కాటు, విద్యుదాఘాతం, రోడ్డు ప్రమాదాల్లో ఎక్కువగా పశువులు మృత్యువాత పడుతుంటాయి. బీమా లేకపోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు.

బీమాకు కావాల్సినవి

బీమా చేయించేటప్పుడు రైతు ఆధార్ కార్డు, తెల్ల రేషన్‌కార్డు ఉండాలి. పశువులకు బీమా చేసే క్రమంలో ట్యాగ్ వేస్తారు. పశువులు చనిపోయిన వెంటనే రైతులు బీమా కంపెనీ ప్రతినిధులకు సమాచారం అందజేస్తే పరిహారం అందజేస్తారు. బీమా చేసిన పశువులను కొనుగోలు చేసిన వ్యక్తి ఏడు రోజుల్లో బీమా కంపెనీ ప్రతినిధులకు సమాచారం ఇచ్చి తన పేరు మీదకు బీమాను మార్చుకోవాలి.

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో..

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం మొదటి మూడేళ్ల పశుబీమాకు సంబంధించి లబ్ధిదారుడి ప్రీమియాన్ని చెల్లించేది. దీంతో రైతులకు తెలియకుండానే వారి పశువులు, జీవాలు చనిపోతే బీమా మొత్తం వచ్చేది. ఆ తరువాత కేంద్రం పథకంలో అవకతవకలు జరుగుతున్నాయని రైతు వాటాను తప్పనిసరి చేసింది. ప్రస్తుత కూటమి ప్రభుత్వం పథకం అమలుపై శ్రద్ధ చూపడం లేదు. రైతులకు అవగాహన కల్పించకుండా కొద్దిమంది రైతులకు బీమాను చేస్తోంది. దీంతో చాలా మంది పేద పశుపోషకులు తీవ్రంగా నష్టపోతున్నారు.

జిల్లాలో పశు సంపద వివరాలు

తెల్లజాతి పశువులు	- 1.15 లక్షలు
గేదెలు	- 6.25 లక్షలు
గొర్రెలు	- 10.5 లక్షలు
మేకలు	- 3.5 లక్షలు
పందులు	- 5300
కోళ్లు	- 11.85 లక్షలు

బీమా తప్పనిసరి



రైతులు తమ పశువులు, జీవాలకు 20 శాతం వాటా ప్రీమియం చెల్లిస్తే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మిగిలిన 80 శాతం వాటాను చెల్లిస్తాయి. దేశవాళీ, సంకర జాతి పశువులకు రూ.400, నాటుజాతి పశువులకు రూ.200 చొప్పున రైతులు తమ వాటాగా చెల్లించాలి. జీవాలకు మాత్రం రైతు వాటాగా రూ.20 చెల్లించాలి.

– కోటేశ్వరరావు, పశువైద్యులు, చాకలికొండ

విజిలెన్స్ తనిఖీలు

వింజమూరు(ఉదయగిరి): వింజమూరుతో పాటు చాకలికొండలోని ఎరువుల దుకాణాల్లో జిల్లా విజిలెన్స్ అధికారులు సోమవారం తనిఖీలు చేపట్టారు. చాకలికొండలోని కార్తికేయ ఎరువుల దుకాణంలో ఎరువుల స్టాక్‌లో తేడాలు ఉండడం, బిల్లులు లేకపోవడం గమనించారు. రూ.2.96 లక్షల విలువైన ఎరువులను సీజ్ చేసి 6ఏ కేసు నమోదు చేశారు. విజిలెన్స్ వ్యవసాయాధికారి వేణుగోపాల్, హెడ్ కానిస్టేబుల్ హరికృష్ణ, మండల ఏఓ శివనాగప్రసాద్ పాల్గొన్నారు.

పంచాయతీ కార్యదర్శుల బదిలీ

ఉదయగిరి: సాధారణ బదిలీల్లో భాగంగా మండలంలో విధులు నిర్వహిస్తున్న పంచాయతీ కార్యదర్శులను వివిధ ప్రాంతాలకు బదిలీచేస్తూ జిల్లా అధికారులు సోమవారం ఉత్తర్వులు జారీచేశారు. శకునాలపల్లిలో పనిచేస్తున్న జీ అమర్‌నాథ్‌రెడ్డి బుచ్చిరెడ్డిపాళెం మండలం పంచేడు బదిలీ అయ్యారు. గండిపాళెం పీఎస్ కరిముల్లాను శకునాలపల్లి, కొండాయపాళెం పీఎస్ నాగూర్‌బీని తిరుమలాపురం, అప్పసముద్రం పీఎస్ చంద్రశేఖర్‌ను జి.అయ్యవారిపల్లి, అక్కడి పీఎస్ ఏ శ్రీనివాసులును అప్పసముద్రం, తిరుమలాపురం పీఎస్ వెంకటరమణను గండిపాళేనికి బదిలీ చేశారు.

ఇన్‌చార్జి ఎంపీడీఓ బదిలీ

వరికుంటపాడు: మండల ఇన్‌చార్జి ఎంపీడీఓగా పనిచేస్తున్న ఎస్ మల్లికార్జున దుత్తలూరు ఎంపీడీఓ కార్యాలయానికి బదిలీ అయ్యారు. ఉదయగిరి ఈఓపీఆర్డీగా పనిచేస్తున్న ఆయన్ని తాత్కాలికంగా ఇన్‌చార్జి ఎంపీడీఓగా నియమించారు. సాధారణ బదిలీల్లో భాగంగా అతన్ని బదిలీ చేశారు. అలాగే కోవూరులో ఈఓపీఆర్డీగా పని చేస్తున్న ఖాదర్‌వల్లిని వరికుంటపాడు ఈఓపీఆర్డీగా నియమించారు.

పోషకాహారంతో సంపూర్ణ ఆరోగ్యం



గర్భిణులు, బాలింతలకు ఐరన్ సిరప్‌ల పంపిణీ

కావలి: పోషకాహారంతో సంపూర్ణ ఆరోగ్యాన్ని పొందవచ్చని డాక్టర్ రామ్‌సెంటర్ విశ్వోదయ చైర్మన్ దొడ్ల మనోహర్‌రెడ్డి, డైరెక్టర్ కూనం తాతిరెడ్డి, సామాజిక కార్యకర్త ఎం మాలకొండారెడ్డి పేర్కొన్నారు. పోషకాహార మాసోత్సవాల ముగింపు సందర్భంగా పట్టణంలోని పాతవూరు అంగన్‌వాడీ కేంద్రంలో డాక్టర్ రామ్‌సెంటర్ విశ్వోదయ ఆధ్వర్యంలో గర్భిణులు, బాలింతలకు పోషకాహారంపై సోమవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చిరుధాన్యాల్లో పోషకాలు పుష్కలంగా లభిస్తాయని, వాటిని తీసుకోవడం ద్వారా రక్తహీనతను అధిగమించవచ్చని తెలిపారు. అనంతరం ఐరన్ సిరప్‌లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ రామ్ సెంటర్ డైరెక్టర్ కూనం తాతిరెడ్డి, అంగన్‌వాడీలు రమణమ్మ, జ్యోతి, సర్తాజ్, మహిళా సంరక్షణ కార్యదర్శి పవనకుమారి పాల్గొన్నారు.

3 నుంచి శరన్నవరాత్రి ఉత్సవాలు

సోమశిల: సోమశిలలోని కామాక్షి సమేత సోమేశ్వరాలయంలో వచ్చే నెల 3 నుంచి 12వ తేదీ వరకు శరన్నవరాత్రి ఉత్సవాలను నిర్వహించనున్నట్లు ఆలయ అర్చకులు అన్నవరపు రామకృష్ణశర్మ సోమవారం తెలిపారు. 3న చండీ, 4న భవానీ, 5న గాయత్రిదేవి, 6న అన్నపూర్ణాదేవి అలంకారం, 7న గజలక్ష్మి, 8న కాళికామాత, 9న సరస్వతీదేవి, 10న దుర్గాదేవి, 11న మహిషాసురమర్దిని, 12న కామాక్షిదేవి అలంకారంలో అమ్మవారు భక్తులను అనుగ్రహిస్తారని వివరించారు.

వరికుంటపాడు : స్థానిక నాగరప్పమ్మ ఆలయంలో వచ్చే నెల 3 నుంచి 12వ తేదీ వరకు శరన్నవరాత్రి ఉత్సవాలను నిర్వహించనున్నట్లు నిర్వాహకులు సోమవారం తెలిపాపారు. 3న బాలాత్రిపురసుందరీదేవి, 4న గాయత్రిదేవి, 5న అన్నపూర్ణాదేవి, 6న సంతానలక్ష్మి, 7న కామాక్షిదేవి, 8న మహాలక్ష్మి, 9న సరస్వతీదేవి, 10న దుర్గాదేవి, 11న మహిషాసురమర్దిని, 12న రాజరాజేశ్వరిదేవి అలంకారంలో అమ్మవారు భక్తులకు దర్శనమిస్తారని వివరించారు.

కలిగిరి: మండలంలోని తెల్లపాడులో ఉన్న భద్రకాళి అమ్మవారి ఆలయంలో వచ్చే నెల 3 నుంచి శరన్నవరాత్రి ఉత్సవాలను వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయ ధర్మకర్త జూపల్లి వెంకటేశ్వర్లు సోమవారం తెలిపారు. 3న బాలత్రిపురసుందరీదేవి, 4న గాయత్రీదేవి, 5న లలితాత్రిపురసుందరీదేవి, 6న సరస్వతీదేవి, 7న అన్నపూర్ణాదేవి, 8న మహాలక్ష్మీదేవి, 9న రాజరాజేశ్వరీదేవి, 10న దుర్గాదేవి (దుర్గాష్టమి), 11న మహిషాసురమర్దిని, 12న భద్రకాళీదేవిగా అమ్మవారు భక్తులను కటాక్షించనున్నట్లు వివరించారు.

బాధితులకు ఆర్థిక సాయం



చెక్కు అందజేస్తున్న డాక్టర్ జే ప్రణీత్

ఆత్మకూరు: పట్టణానికి చెందిన శీలా గౌరీదేవి, శీలా కాశీవిశ్వనాథ్ వైఎస్సార్‌సీపీ నాయకుడు, డాక్టర్ జే ప్రణీత్ సోమవారం రూ.10వేలు ఆర్థిక సాయం అందజేశారు. నిరుపేదలైన వారు కరోనా సమయంలో తండ్రిని కోల్పోయారు. అప్పట్నుంచి తల్లి చిన్నచిన్న పనులు చేస్తూ చదివిస్తోంది. నెల క్రితం ఆమె కూడా మరణించడంతో పిల్లలు అనాథలయ్యారు. ఈ నేపథ్యంలో వారి కుటుంబ పరిస్థితిని తెలుసుకున్న డాక్టర్ జే ప్రణీత్ డాక్టర్ వింజం దొరసానమ్మ మెమోరియల్ ట్రస్ట్ ద్వారా నగదు సాయం అందజేశారు. భవిష్యత్‌లోనూ తన వంతు సాయం అందజేస్తానని భరోసా ఇచ్చారు. ట్రస్ట్ సభ్యులు డాక్టర్ కుమార్, అశోక్, తదితరులు పాల్గొన్నారు.

వక్తృత్వ పోటీల్లో చేజర్ల విద్యార్థినికి తృతీయ స్థానం



చేజర్ల: స్వర్ణాంధ్ర ప్రదేశ్-2047 కార్యక్రమంలో భాగంగా నెల్లూరులో సోమవారం నిర్వహించిన జిల్లాస్థాయి వక్తృత్వ పోటీల్లో చేజర్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన పదో తరగతి విద్యార్థిని జీ పుష్ప తృతీయ స్థానంలో నిలిచినట్లు హెచ్‌ఎం హైమావతి తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థినిని ఉపాధ్యాయులు అభినందించారు.

రోడ్డు ప్రమాదంలో మహిళకు గాయాలు

మర్రిపాడు: మండలంలోని రామానాయుడుపల్లి ఎస్సీ కాలనీ సమీపంలో సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ మహిళ గాయాలపాలైంది. వివరాలు.. ఆత్మకూరు నుంచి సీతారామపురం వెళ్తున్న ద్విచక్ర వాహనచోదకుడు రామానాయుడుపల్లి సమీపంలో నందవరం- ఉదయగిరి ప్రధాన రహదారి మార్జిన్‌లో కొందరు పందుల పెంపకందారులు వేసిన వల కారణంగా అదుపుతప్పి పడిపోయాడు. ఈ ప్రమాదంలో ద్విచక్ర వాహనంపై ఉన్న మహిళ గాయాలపాలైంది. ఏఎస్సై భాస్కర్ ఘటనా స్థలానికి చేరుకుని బాధితురాలిని ఆస్పత్రికి తరలించారు. కాగా పందుల పెంపకందారులపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేశారు.

యథేచ్ఛగా ప్రభుత్వ భూముల ఆక్రమణ



ప్రభుత్వ భూమిని చదును చేసిన దృశ్యం

మర్రిపాడు: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తొలిరోజు నుంచే ప్రభుత్వ భూములపై టీడీపీ నాయకులు కన్నేసి కబ్జాల పర్వానికి తెరతీశారు. గతంలో నందవరం, కంపసముద్రం గ్రామాల్లో ప్రభుత్వ భూములను రాత్రికి రాత్రే చదును చేసి ఆక్రమించేందుకు యత్నించారు. ఈ విషయమై మీడియాలో కథనాలు రావడంతో అధికారుల స్పందించి పరిశీలించి బోర్డులు ఏర్పాటు చేయడంతో ఆక్రమణలకు అడ్డుకట్ట పడింది. తాజాగా సింగనపల్లిలోని సర్వే నంబర్ 35, బాటలోని సర్వే నంబర్ 42లో ఉన్న సుమారు 30 ఎకరాల భూమిపై కన్నేసిన టీడీపీ నాయకులు రాత్రికి రాత్రే చదును చేసే కార్యక్రమాన్ని చేపట్టారు. అధికారం అండతో టీడీపీ నాయకులు ప్రభుత్వ భూములను తమ ఆధీనంలోకి తెచ్చుకుని అక్రమంగా సాగు చేపట్టడమో లేదా విక్రయాలు సాగించడమో పనిగా పెట్టుకోవడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఈ విషయాన్ని తహసీల్దార్ స్వప్న దృష్టికి తీసుకెళ్లగా సింగనపల్లి, బాట గ్రామాల్లో భూ ఆక్రమణల విషయం తమ దృష్టికి వచ్చిందన్నారు. అధికారులతో కలిసి పరిశీలించి బోర్డులు ఏర్పాటు చేస్తామని తెలిపారు. ప్రభుత్వ భూములను ఎవరైనా అక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

నేడు పొలం పిలుస్తోంది

వరికుంటపాడు: మండలంలోని తూర్పుబోయమడుగుల, కాంచెరువు రైతుసేవా కేంద్రాల పరిధిలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం జరుగుతుందని ఏఓ రవికుమార్ సోమవారం తెలిపారు. అక్టోబర్ 3న తిమ్మారెడ్డిపల్లె, వేంపాడు గ్రామాల్లో కార్యక్రమం జరుగుతుందని చెప్పారు. వ్యవసాయ, అనుబంధ శాఖల అధికారులు, శాస్త్రవేత్తలు పాల్గొని సూచనలు, సలహాలను అందజేస్తారని వివరించారు.

ఎక్సైజ్ సీఐ బాధ్యతల స్వీకరణ




ఆత్మకూరు: ఆత్మకూరు ఎక్సైజ్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా ఆర్వీ రమణమ్మ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. సాధారణ బదిలీల్లో భాగంగా ఉదయగిరిలో పనిచేస్తున్న ఆమె ఆత్మకూరుకు వచ్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆత్మకూరు ఎక్సైజ్ పరిధిలో మద్యం అక్రమ రవాణా, విక్రయాలను అరికట్టేందుకు కృషి చేస్తామని పేర్కొన్నారు.

పరిసరాల శుభ్రత అందరి బాధ్యత



కావలి: పరిసరాల శుభ్రత అందరి బాధ్యతని ఆర్థిక అక్షరాస్యత కౌన్సిలర్ రవి పేర్కొన్నారు. పట్టణంలోని పాతూరు మున్సిపల్ ఉన్నత పాఠశాలలో స్వచ్ఛత హీ సేవా కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. విద్యార్థులతో పాటు ఉపాధ్యాయులు పాఠశాల పరిసరాలను శుభ్రం చేసి ప్రాంగణంలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో ఆర్థిక అక్షరాస్యత కౌన్సిలర్ పాల్గొని మాట్లాడారు. స్వచ్ఛత హీ సేవలో ప్రతిఒక్కరూ భాగస్వాములైతే సమాజంలో గొప్ప మార్పు వస్తుందన్నారు. ఆర్థిక అక్షరాస్యత సిబ్బంది ప్రణీత్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్సై బాధ్యతల స్వీకరణ



సంగం: మండల నూతన ఎస్సైగా రాజేష్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. తొలుత ఆయన సంగమేశ్వర స్వామి, ఆంజనేయస్వామి ఆలయాల్లో పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ మండలంలో శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

800 గ్రాముల గంజాయి స్వాధీనం

కావలి: పట్టణంలోని తుమ్మలపెంటరోడ్డులో ఉన్న సాయిబాబా మందిరం సమీపంలో గంజాయి కలిగి ఉన్న కావలికి చెందిన కొక్కుసాయి సునీల్, గుంజి తిరుమల, నెల్లూరులోని కపాడిపాళేనికి చెందిన షేక్ సిరాజ్‌ను సోమవారం అరెస్ట్ చేసినట్లు కావలి వన్ టౌన్ సీఐ ఎండీ ఫిరోజ్ తెలిపారు. వారి వద్ద నుంచి 800 గ్రాము ల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు.

తపాల ఉద్యోగుల సమావేశం

ఉదయగిరి: ఉదయగిరి సబ్‌డివిజన్ కార్యాలయంలో సబ్‌డివిజన్ స్థాయి సిబ్బందితో నెల్లూరు డివిజన్ సూపరిండెంటెంట్ శ్రీనివాస్ సోమవారం సమావేశం నిర్వహించారు. తపాల బీమా పాలసీలు విరివిగా చేయాలని కోరారు. అనంతరం బీమా పాలసీలను ఎక్కువగా చేసి మొదటి మూడు స్థానాల్లో నిలిచిన బీపీఎంలకు సిల్వర్ కాయిన్‌లను బహుమతిగా అందజేశారు. ఐపీఓ సాయికృష్ణారెడ్డి, మెయిల్ ఓవర్సీస్ రామకృష్ణారెడ్డి, ఎస్‌బీఎంలు అనిల్, నజీర్‌బాషా, తిరుపాలయ్య, నరసయ్య, గౌరబ్, తదితరులు పాల్గొన్నారు.

ప్రయాణికులకు మెరుగైన సేవలు

- ఆర్టీసీ జోనల్ ఈడీ గిడుగు వెంకటేశ్వరరావు



ఆర్టీసీ సిబ్బందిని అభినందిస్తున్న నెల్లూరు జోనల్ ఈడీ వెంకటేశ్వరరావు

ఆత్మకూరురూరల్: ఆర్టీసీకి ప్రయాణికులే దేవుళ్లు అని, వారికి మెరుగైన సేవలు అందించేందుకు సిబ్బంది కృషి చేయాలని నెల్లూరు జోనల్ ఆర్టీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ గిడుగు వెంకటేశ్వరరావు అన్నారు. ఆత్మకూరు ఆర్టీసీ డిపోను సోమవారం ఆయన తనిఖీ చేశారు. తొలుత ఎంజీఆర్ బస్ స్టేషన్‌ను పరిశీలించారు. రికార్డులను తనిఖీ చేసి ప్రయాణికులకు అందిస్తున్న సౌకర్యాలపై ఆరా తీశారు. డిపో పరిధిలో అధిక కేఎంపీఎల్ సాధించిన బస్సు డ్రైవర్లు, గ్యారేజీ కార్మికులను ప్రత్యేకంగా అభినందించారు. అనంతరం గ్యారేజీ ఆవరణలో మొక్కలు నాటారు. ఆత్మకూరు డీఎం కరీముస్నీసా, ఏడీఎం కల్పన, సెక్యూరిటీ విభాగాధిపతి నాగేశ్వరరావు, యూనియన్ సంఘాల నాయకులు మేకపాటి చిన్నారెడ్డి, కిషోర్, సుబ్బయ్య, శేఖర్, మునగచర్ల వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

విజేతలకు బహుమతుల ప్రదానం



కావలిలో బహుమతుల ప్రదానం

కావలి: వరల్డ్ స్పేస్‌వీక్‌ను పురస్కరించుకుని పట్టణంతో పాటు మండలంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లోని 8,9, 10వ తరగతి విద్యార్థులకు వ్యాసరచన పోటీలను సోమవారం నిర్వహించారు. ఎంఈఓలు బండి గోవిందయ్య సీహెచ్ వెంకటసుబ్బయ్య ఆధ్వర్యంలో మండల విద్యావనరుల కేంద్రంలో పోటీలను నిర్వహించారు. పట్టణంలోని పాతూరు మున్సిపల్ ఉన్నత పాఠశాలకు చెందిన షేక్ కౌనిన్ మసీరా ప్రథమ, కావలి జెడ్పీ బాలికోన్నత పాఠశాల విద్యార్థిని సీహెచ్ హారిక ద్వితీయ, ఏపీ గిరిజ సంక్షేమ బాలుర గురుకుల పాఠశాల విద్యార్థి వీ వెంకటకిషోర్ తృతీయ స్థానంలో నిలిచారు. విజేతలకు కావలికి చెందిన శాస్త్రవేత్త పుస్తకాలు బహుమతులుగా అందజేశారు.

సీతారామపురం: మండలంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలకు చెందిన విద్యార్థులకు వ్యాసరచన పోటీలను నిర్వహించారు. సీతారామపురం ఆదర్శ పాఠశాలలో నిర్వహించిన ఈ పోటీలను ఎంఈఓ మస్తాన్‌వలి పరిశీలించారు. కేజీబీవీకి చెందిన 8వ తరగతి విద్యార్థిని మేఘన ప్రథమ స్థానం, ఆదర్శ పాఠశాలకు చెందిన 9వ తరగతి విద్యార్థి రాకేష్ ద్వితీయస్థానం, బసినేనిపల్లి జెడ్పీ హైస్కూల్‌కు చెందిన 9 తరగతి విద్యార్థి ఎలీషాబాబు తృతీయ స్థానంలో నిలిచారు. వారిని ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు అభినందించారు.

తాగునీటి సమస్యలు తలెత్తకుండా చర్యలు

- ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్



అధికారులతో సమీక్షిస్తున్న ఎమ్మెల్యే కాకర్ల సురేష్

ఉదయగిరి: నియోజకవర్గంలో ఏ గ్రామంలో కూడా తాగునీటి సమస్య తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని ఎమ్మెల్యే కాకర్ల సురేష్ ఆర్‌డబ్ల్యూఎస్ శాఖ అధికారులను ఆదేశించారు. సోమవారం ఆయన నెల్లూరులోని తన క్యాంపు కార్యాలయంలో ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులతో సమావేశమయ్యారు. ఎన్టీఆర్ సుజల స్రవంతి పథకం, ప్రస్తుతం మండలాల్లో జరుగుతున్న ఆర్‌డబ్ల్యూఎస్ పనులపై సమీక్షించారు. ఎన్టీఆర్ సుజల స్రవంతి కింద అవసరమైన పంచాయతీల్లో మినరల్ వాటర్‌ప్లాంట్లు ఏర్పాటు చేయాలని తెలిపారు. గేదెలు, జీవాల కోసం పొలాల్లో బోర్లు వేసి చేతిపంపులు అమర్చాలని సూచించారు. ఫ్లోరిన్ సమస్య అధికంగా ఉన్న గ్రామాలకు మినరల్ వాటర్ అందించే ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ రాధయ్య, డీఈ డీ బవనారాయణ, ఏఈలు ఎస్‌కే అహ్మద్, ఏ సతీష్, ఎస్‌కే జిలాని, టీ హరిత, కే వరప్రసాద్, పీ జగన్నాథం, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో క్రీడాకారిణి దుర్మరణం



మృతురాలు మైథిలి

కావలి: పట్టణ పరిధిలోని మద్దూరుపాడు వద్ద సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ప్రకాశం జిల్లాకు చెందిన ఓ క్రీడాకారిణి మృత్యువు పాలైంది. కావలి రూరల్ ఎస్సై ఎం బాజీబాబు వివరాల మేరకు..ప్రకాశం జిల్లా పొన్నలూరు మండలం చెరుకూరు గ్రామానికి చెందిన సన్నిబోయిన మైథిలి (15) అదే జిల్లా ముండ్లమూరివారిపాళెం జెడ్పీ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతోంది. పల్నాడు జిల్లా వినుకొండలో ఈ నెల 28 నుంచి 30వ తేదీ వరకు జరిగిన రాష్ట్ర స్థాయి క్రీడా పోటీల్లో పాల్గొనేందుకు సహచర విద్యార్థినులతో కలిసి వెళ్లింది. సోమవారం వినుకొండ నుంచి ఒంగోలుకు చేరుకున్న మైథిలి తన స్వగ్రామానికి చెందిన కుంచాల కృపాకర్ అనే వ్యక్తితో కలిసి స్కూటీపై నెల్లూరుకు బయలుదేరింది. ఈ క్రమంలో మద్దూరుపాడు లోని దాబా వద్ద చెన్నై-కలకత్తా జాతీయ రహదారిపై వెళ్తున్న గుర్తుతెలియని వాహనం వారి స్కూటీని ఢీకొంది. ఈ ప్రమాదంలో మైథిలి తీవ్రంగా గాయపడగా, కృపాకర్‌కు స్వల్ప గాయాలయ్యాయి. మైథిలిని నెల్లూరు ప్రభుత్వాస్పత్రికి తరలిస్తుండగా మార్గం మధ్యలో విద్యార్థిని మరణించింది. విద్యార్థిని మైథిలి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

11 మట్టి ట్రాక్టర్ల పట్టివేత

సోమశిల: మండలంలోని పడమటికంభంపాడు చెరువు నుంచి మట్టిని అక్రమంగా తరలిస్తున్న 11 ట్రాక్టర్లను ఏఎస్సై లక్ష్మీనారాయణ ఆదివారం అర్ధరాత్రి పట్టుకున్నారు. గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడి ఇటుకబట్టీల వద్దకు చెరువులోని మట్టిని ట్రాక్టర్ల ద్వారా అక్రమంగా తరలిస్తుండగా పోలీసులకు సమాచారం అందింది. దీంతో ఏఎస్సై అక్కడకు చేరుకుని మట్టి రవాణా చేస్తున్న ట్రాక్టర్లను స్వాధీనం చేసుకుని స్టేషన్‌కు తరలించారు. కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

రెండు ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

కొండాపురం: మండలంలోని చింతలదేవి వద్ద ఉన్న ఉప్పుటేరు వాగు నుంచి కొండాపురానికి ఇసుక అక్రమంగా తరలిస్తున్నారనే సమాచారంతో కొండాపురం ఎస్సై మహేంద్ర తన సిబ్బందితో ఆదివారం అర్ధరాత్రి దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో రెండు ట్రాక్టర్లను పట్టుకున్నారు. ఎలాంటి అనుమతులు లేకపోవడంతో కేసు నమోదు చేసి కోర్టుకు హాజరుపరచనున్నట్లు ఎస్సై తెలిపారు.